RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 108 | మే 10 ఆదివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 108 | May 10 Sunday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


హైదరాబాద్ భూముల ధరకు రెక్కలు

2

## నేడు ప్రధాని రాక

**పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ**



హైదరాబాద్ జనసంఘర్షణ

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం భాగ్యనగర పర్యటనకు వస్తున్న నేపథ్యంలో, హైదరాబాద్ నగరం భారీ భద్రతా వలయంలోకి వెళ్లిపోయింది. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ప్రధాని పాల్గొని ప్రసంగించనున్నారు. అధికారిక షెడ్యూల్ ప్రకారం, ఆయన మధ్యాహ్నం 2:50 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా సభా ప్రాంగణానికి రోడ్డు మార్గంలో ప్రయాణిస్తారు. ప్రధాని రాకను పురస్కరించుకుని ప్రభుత్వం మరియు పోలీసు యంత్రాంగం అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేశాయి. భద్రత విషయంలో ఏమాత్రం

➤ మిగతా 2వ పేజీలో..

## ప్రపంచస్థాయి మౌలిక వసతులతో తీర్చిదిద్దుతాం

**తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం**
**పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ**
**సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**




హైదరాబాద్ జనసంఘర్షణ

భవిష్యత్తులో పెరగబోయే పట్టణ జనాభా అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి మౌలిక వసతులతో తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. సచివాలయంలో నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆధునీకరణ మరియు పట్టణీకరణ వల్ల ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సమగ్ర వ్యూహంతో ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. ముఖ్యంగా భాగ్యనగరాన్ని ట్రాఫిక్ కష్టాలు లేని 'సిగ్నల్ ఫ్రీ సిటీ'గా మార్చడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అండర్ పాస్, సర్ఫేస్ మరియు ఎలివేటెడ్ కారిడార్లతో కూడిన 'త్రీ లెవెల్' రవాణా వ్యవస్థను తీసుకురానున్నట్లు వివరించారు. ట్రాఫిక్ నియంత్రణ కేవలం రోడ్ల విస్తరణతోనే సాధ్యం కాదని, మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. నగరంలో పార్కింగ్ సమస్యల పరిష్కారానికి మల్టీ లెవల్ పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని మూడు విభిన్న జోన్లుగా అభివృద్ధి చేసేందుకు 'తెలంగాణ రైజింగ్-2047' పేరుతో మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించామని పేర్కొన్నారు. దీని ప్రకారం ఔటర్ రింగ్ రోడ్డు ఏరియాను సర్వీస్ సెక్టార్‌గా, ఔటర్ - రీజనల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని

➤ మిగతా 2వ పేజీలో..

## ముఖ్యమంత్రి సువేంద్ ప్రమాణం

**ప్రముఖులతో కలిసి హాజరైన చంద్రబాబు నాయుడు**



కలకత్తా జనసంఘర్షణ

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కొలువుదీరింది. శనివారం కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన అట్టహాసమైన కార్యక్రమంలో బెంగాల్ 9వ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ ఆర్.ఎన్. రవి ఆయనతో పదవీ ప్రమాణం చేయించారు. సువేందు అధికారితో పాటు అగ్నిమిత్ర పాల్, దిలీప్ ఘోష్, అశోక్ కిర్తానియా, నిశిత్ ప్రామాణిక్ మరియు క్షుదిరామ్ టుడు మంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ చారిత్రక ఘట్టానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో

➤ మిగతా 2వ పేజీలో..

## ఉత్కంఠకు తెర

**నేడు విజయ్ ప్రమాణ స్వీకారం.. ఉత్తర్వులు జారీ చేసిన గవర్నర్**




చెన్నై జనసంఘర్షణ

తమిళనాడు రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. తమిళనాడు కొత్త ముఖ్యమంత్రిగా తమిళగ వెట్రి కజగం (ుఎఖ) అధినేత జోసెఫ్ విజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేయడంతో, ఆదివారం ఉదయం 10 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో విజయ్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలంపై స్పష్టత రావడంతో గవర్నర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ముందుగా విజయ్ తన మద్దతుదారులతో కలిసి లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. సుమారు గంటన్నరకు పైగా సాగిన ఈ భేటీలో తనకు మద్దతు తెలుపుతున్న వివిధ పార్టీల ఎమ్మెల్యేల లేఖలను ఆయన సమర్పించారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన 118 మంది ఎమ్మెల్యేల మద్దతు లేకపోవడంతో ఇప్పటివరకు అనిశ్చితి కొనసాగింది. అయితే తాజాగా కాంగ్రెస్, వామపక్షాలు (సీపీఐ, సీపీఎం), వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు విజయ్ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించడంతో మొత్తం మద్దతుదారుల సంఖ్య 120కి చేరింది. మెజార్టీ మార్కును అధిగమించడంతో సంతృప్తి చెందిన గవర్నర్, విజయ్‌ను

➤ మిగతా 2వ పేజీలో..

## కాళేశ్వరంపై తక్కువ మాట్లాడడం తగదు

**మాజీ మంత్రి హరీశ్‌రావు**



సిద్ధిపేట జనసంఘర్షణ

తెలంగాణ ప్రజల సాగు, తాగునీటి అవసరాల కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ముందుచూపుతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని, దానిని తక్కువ చేసి మాట్లాడటం అంటే రాష్ట్రానికి ద్రోహం చేయడమేనని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. సిద్ధిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎంతటి కరవు పరిస్థితుల్లోనైనా నదిలో నీటిని నిలిపి ఉంచే సత్తా మేడిగడ్డకు ఉందని, చీకట్లో కాంతినిచ్చే దీపంలా ఈ ప్రాజెక్టు తెలంగాణను ఆదుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.
కాంగ్రెస్ పార్టీ నాయకులు జలహారతుల పేరుతో కేవలం రాజకీయ డ్రామాలు చేస్తున్నారే తప్ప, వారి మాటల్లో నిజాయితీ లేదని హరీశ్ రావు విమర్శించారు. గతంలో ఏడున్నరేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కానీ, ప్రస్తుత పాలనలో కానీ ప్రాణహిత ప్రాజెక్టు కోసం వారు చేసిందేమీ లేదన్నారు. నాలుగేళ్లలో ప్రాణహిత పూర్తి చేస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్, బడ్జెట్‌లో కేటాయిస్తున్న అరకొర నిధులతో ఆ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందని ఆయన ప్రశ్నించారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రాణహిత చేవెళ్ల కోసం కేవలం రూ. 50 కోట్లు కేటాయించడం

## హార్మూజ్ జలసంధిలో ప్రమాదం

**ఒక భారతీయ నావికుడు మృతి**

దుబాయ్ జనసంఘర్షణ

హార్మూజ్ జలసంధి సమీపంలో జరిగిన ఒక నౌకా ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. సముద్ర ప్రయాణంలో ఉన్న ఒక నావలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అందులో విధులు నిర్వహిస్తున్న ఒక భారతీయ నావికుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాద సమయంలో సదరు నౌకలో మొత్తం 18 మంది భారతీయ సిబ్బంది ఉన్నట్లు సమాచారం అందుతోంది. మంటలు వ్యాపించిన ఘటనలో మరో నలుగురు సిబ్బంది తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం దుబాయ్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై దుబాయ్‌లోని

➤ మిగతా 2వ పేజీలో..

## ప్రపంచస్థాయి మౌలిక వసతులతో తీర్చిదిద్దుతాం

**మొదటిపేజీ తరువాయి..** మాన్యుఫ్యాక్చరింగ్ సెక్టార్‌గా, రీజనల్ రింగ్ రోడ్డు అవతల ఉన్న ప్రాంతాన్ని అగ్రికల్చర్ సెక్టార్‌గా అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణ మరియు కాలుష్య నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను మన సంస్కృతికి ప్రతిబింబంగా తీర్చిదిద్దడంతో పాటు, నగరంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీలో ఈవీ బస్సులను ప్రవేశపెట్టడంతో పాటు, కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని ఆటోలను ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ ద్వారా ఈవీ వాహనాలుగా మార్చేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాలపై సుదీర్ఘంగా చర్చించారు.

# కాళేశ్వరంపై తక్కువ మాట్లాడడం తగదు

**మొదటిపేజీ తరువాయి..** వారి చిత్తశుద్ధిని వెల్లడిస్తోందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాజెక్టుల విషయంలో పచ్చి అబద్ధాలు చెపుతున్నారని, నాడు జలయజ్ఞాన్ని ధనయజ్ఞం అని విమర్శించిన వ్యక్తే నేడు అసంబద్ధమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగిన 30 నెలల కాలంలో కనీసం మరమ్మతులు కూడా చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డను బాగు చేస్తే కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందో అన్న భయంతోనే ప్రభుత్వం తుమ్మడిహట్టి అంశాన్ని తెరపైకి తెస్తోందని హరీశ్ రావు విమర్శించారు. మండుటెండల్లో కూడా మేడిగడ్డ వద్ద నీటి ప్రవాహం కొనసాగుతోందని, ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయాలు పక్కన పెట్టి సాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ముఖ్యమంత్రి సువేందు ప్రమాణం

పాటు జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్ వంటి అగ్రనేతలు హాజరయ్యారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా పలు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ కార్యక్రమానికి విచ్చేసి నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 207 స్థానాల్లో ఘనవిజయం సాధించి ప్రభంజనం సృష్టించగా, అధికార తృణమూల్ కాంగ్రెస్ కేవలం 80 సీట్లకే పరిమితమైంది. ముఖ్యంగా సువేందు అధికారి ఈ ఎన్నికల్లో సంచలన విజయం నమోదు చేశారు. మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహించిన భవానీపూర్ నియోజకవర్గంలో ఆమెపైనే 15 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందడం విశేషం. 55 ఏళ్ల సువేందు అధికారి గతంలో తృణమూల్ కాంగ్రెస్‌లో కీలక నేతగా, మమతా బెనర్జీ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 2020లో ఆ పార్టీని వీడి బీజేపీలో చేరిన ఆయన, ఈ ఎన్నికల్లో పార్టీని ముందుండి నడిపించి బెంగాల్‌లో కాషాయ జెండా ఎగురవేయడంలో కీలక పాత్ర పోషించారు. బెంగాల్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తొలి బీజేపీ నేతగా ఆయన చరిత్ర సృష్టించారు.

# నేడు ప్రధాని రాక

**మొదటిపేజీ తరువాయి..** రాజ్ పడకుండా పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో మూడంచెల రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. సుమారు 2,000 మందికి పైగా పోలీసు బలగాలతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ), క్విక్ రెస్పాన్స్ టీమ్స్, స్నైపర్లు మరియు మఫ్టీ పోలీసులు నిరంతరం నిఘా ఉంచారు. ప్రధాని పర్యటించే మార్గాల్లో డ్రోన్ల వినియోగంపై నిషేధం విధించడంతో పాటు ఆ ప్రాంతాలను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

ఈ భారీ బహిరంగ సభ కారణంగా సికింద్రాబాద్ మరియు బేగంపేట పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసులు స్పష్టం చేశారు. ముఖ్యంగా బేగంపేట విమానాశ్రయం నుండి పరేడ్ గ్రౌండ్స్‌కు దారితీసే ప్రధాన రహదారులతో పాటు సికింద్రాబాద్‌లోని కీలక జంక్షన్లలో వాహనాల రాకపోకలపై నియంత్రణ ఉంటుంది. సాధారణ ప్రజలకు మరియు వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించిన ట్రాఫిక్ పోలీసులు, అత్యవసరమైతే తప్ప ఈ ప్రాంతాల వైపు రావద్దని కోరారు. ప్రభుత్వం ఈ పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పకడ్బందీగా నిర్వహిస్తోంది.

# ఉత్కంఠకు తెర

సీఎంగా నియమిస్తూ మే 13వ తేదీలోగా అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వాములైన చిన్న పార్టీలు ఒక కీలక నిర్ణయం తీసుకున్నాయి. వీసీకే, వామపక్షాలు ప్రస్తుతానికి మంత్రివర్గంలో చేరడం లేదని, బయట నుంచే మద్దతు ఇస్తామని ప్రకటించాయి. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన రాకుండా ప్రజా తీర్పును గౌరవించేందుకే ఈ మద్దతు ఇస్తున్నట్లు వీసీకే చీఫ్ తిరుమావళవన్ స్పష్టం చేశారు. ఆదివారం జరిగే ప్రమాణ స్వీకార మహోత్సవంలో విజయ్‌తో పాటు మరో 9 మంది మంత్రులుగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో చెన్నైలో టీవీకే ఎమ్మెల్యేలు ఉన్న రిసార్ట్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. విజయ్ నేతృత్వంలో కొలువుదీరనున్న ఈ కొత్త ప్రభుత్వం తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త శకానికి నాంది పలకనుంది.

# హార్ముజ్ జలసంధిలో ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..** అధికారులు పరామర్శించి, వారికి అవసరమైన వైద్య సహాయం అందుతోందని నిర్ధారించారు. నౌక యాజమాన్యంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ బాధితులకు మరియు వారి కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తున్నట్లు కాన్సులేట్ వెల్లడించింది. అయితే, నావలో మంటలు చెలరేగడానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఇరాన్ మరియు అమెరికా దేశాల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన తరుణంలో ఈ ఘటన జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవలే ఇరు దేశాల దళాల మధ్య అక్కడ కాల్పులు కూడా చోటుచేసుకున్నాయి. ఈ అంతర్జాతీయ ఘర్షణల నేపథ్యంలో నౌకలో మంటలు రావడం వెనుక ఏదైనా దాడుల ప్రమేయం ఉందా లేదా అనేది తెలియాల్సి ఉంది. నౌకలపై మరియు పౌరులపై దాడులు జరుగుతున్నాయంటూ ఇరు దేశాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్న క్రమంలో, భారతీయ నావికుడు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం ఈ ఘటనపై లోతైన దర్యాప్తుకు ప్రాధాన్యం ఇస్తోంది.

## ప్రధాని మోడీ ఆత్మీయ పరామర్శ

**97 ఏళ్ల మఖన్‌లాల్ సర్కార్‌కు పాదాభివందనం**

**కోల్‌కతా, మే9 :** పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పశ్చిమ బెంగాల్ కొత్త ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వేదికపై 97 ఏళ్ల వృద్ధుడు మాఖన్ లాల్ సర్కార్ పాదాలకు మోదీ నమస్కరించడం చర్చనీయాంశంగా మారింది. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.వేదికపై మాఖన్ లాల్ సర్కార్‌ను సన్మానించి, కౌగిలించుకున్న ప్రధాని, అనంతరం ఆయన కాళ్లకు నమస్కరిం చారు. బెంగాల్‌లోని సిలిగురికి చెందిన మాఖన్ లాల్ సర్కార్ బీజేపీ సీనియర్ నాయకుడు. ఆయన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడైన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి సన్నిహితుడిగా మెలిగారు. ఆయనకు సహాయకుడిగా పని చేశారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మరణానంతరం జరిగిన అంతిమ యాత్రలో కూడా మాఖన్ లాల్ పాల్గొన్నారని బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య తెలిపారు. కాంగ్రెస్ పాలన సమయంలో దేశభక్తి గీతం పాడినందుకు ఢిల్లీ పోలీసులు మాఖన్ లాల్ సర్కార్‌ను అరెస్టు చేసిన సంఘటనను కూడా బీజేపీ నేతలు గుర్తు చేసుకున్నారు. కోర్టులో క్షమాపణ చెప్పడానికి కూడా మాఖన్ లాల్ నిరాకరించారట. కోర్టులో కూడా అదే పాటను మళ్లీ పాడారట. దీంతో న్యాయమూర్తి.. మాఖన్ లాల్ తిరుగు ప్రయాణ ఖర్చులకు అవసరమైన వంద రూపాయలు ఇవ్వాలని ఆదేశించారట. బెంగాల్‌లో తొలిసారి బీజేపీ అధికారంలోకి రావడంతో ఆ సీనియర్ నాయకుడికి బీజేపీ నేతలు తగిన గౌరవం కల్పించారు.

## లేగదూడను రక్షించే క్రమంలో తెగింపు

**బావిలో పడిప్రాణాలు కోల్పోయిన తండ్రీ కొడుకులు**

**ములుగు, మే9 :** ప్రమాదవశాత్తు బావిలో పడ్డ లేగదూడను రక్షించే క్రమంలో తండ్రీ కొడుకులిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం కర్లపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. తండ్రీకొడుకులైన రస్పుత్ రాజు, పవన్‌లు కర్లపల్లి గ్రామంలోని సుమారు 35 అడుగుల లోతైన బావిలో లేగదూడ పడిపోవడంతో దానిని కాపాడేందుకు ఆ బావిలోకి దిగారు. అయితే ఇద్దరూ ఒకే తాడుతో బావిలోకి దిగే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తాడు ఒక్కసారిగా తెగిపోవడంతో ఇద్దరు బావిలో పడిపోయి నీటిలో చిక్కుకున్నారు. గోవిందరావుపేట సీఐ దయాకర్, ఎస్సై తాజుద్దీనులు ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రస్పుత్ రాజు మృతదేహాన్ని బయటకు తీశారు. పవన్ మృతదేహం కోసం గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు కొనసాగిస్తున్నారు. తండ్రీకొడుకులు గొప్ప మనసుతో ఓ మూగజీవిని రక్షించాలనుకుని ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## జాతీయ రహదారిపై

## మినీ ట్రక్కు బోల్తా.. ఒకరి మృతి..

**నెల్లూరు, మే9 :** నెల్లూరు జిల్లాలో శనివారం రోడ్డు ప్రమాదం సంభవించింది. మర్రిపాడు మండలం చుంచులూరు సమీపంలోని 565వ నంబర్ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న మినీ ట్రక్కు.. ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో పదిమంది

## బెంగాల్ ప్రజలకు మోడీ సాష్టాంగ ప్రణామం

**అశేషంగా హాజరైన ప్రజలకు అభివాదం**

**కోల్‌కతా, మే9** పశ్చిమ బెంగాల్ నూతన ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ ప్రజలకు సాష్టాంగ వందనం చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. భారీ సంఖ్యలో హాజరైన ప్రజలను చూసిన ప్రధాని మోదీ ముందుగా చేతులు ఊపుతూ అభివాదం చేశారు. అనంతరం మోకాళ్లపై కూర్చుని, చేతులు జోడించి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ బెంగాల్ చరిత్రలో బీజేపీ తొలిసారిగా అధికారంలోకి వచ్చింది. తమకు మద్దతుగా నిలిచిన ఆ రాష్ట్ర ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ విధంగా తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ అగ్రనేతలు హాజరయ్యారు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమ బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీ తాజా ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. గతంలో తృణమూల్ కాంగ్రెస్‌లో ఉన్న సువేందు అధికారి, ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నేతగా ఎదిగారు. బెంగాల్‌లో బీజేపీ విజయంలో కీలక పాత్ర పోషించి ఏకంగా ముఖ్యమంత్రి అయిపోయారు.

## డిప్యూటీ సీఎం పవన్ చొరవ

**మస్కట్ నుంచి సొంతూరుకు చేరిన మహిళ**

**అన్నమయ్య, మే9 :** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో ఏపీకి చెందిన మహిళ మస్కట్ నుంచి క్షేమంగా స్వగ్రామానికి చేరుకుంది. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలానికి చెందిన షెహనాజ్ కుటుంబ జీవనం కోసం ఏజెంట్ ద్వారా మస్కట్‌కు వెళ్లి చిత్ర హింసలకు గురైంది. తనకు జీతం ఇవ్వడం లేదని, వేధింపులకు గురిచేస్తున్నారంటూ భర్తకు వీడియో కాల్ చేసి చెప్పింది. తనను రక్షించాలంటూ డిప్యూటీ సీఎం పవన్‌ను వేడుకుంది. షెహనాజ్ బాధలు విన్న వెంటనే డిప్యూటీ సీఎం పవన్ స్పందించారు. మహిళను స్వగ్రామానికి రప్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని తన కార్యాలయ అధికారులకు ఆదేశించారు. ఎట్టకేలకు ఉప ముఖ్యమంత్రి చొరవతో షెహనాజ్ స్వగ్రామానికి చేరుకుంది. కేవలం ఐదు రోజుల్లోనే మస్కట్ నుంచి మహిళను స్వగ్రామానికి డిప్యూటీ సీఎం పేషీ అధికారులు చేర్చారు. మస్కట్ నుంచి ముంబైకి అటు నుంచి విజయవాడకు వాల్మీకిపురం మహిళ షెహనాజ్ చేరుకుంది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పేషీ అధికారులు.. మహిళకు రూ 30,000 నగదు, చీర బహూకరించి సురక్షితంగా స్వగ్రామానికి పంపించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డికి షెహనాజ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. తనను సమస్యల నుంచి రక్షించి స్వగ్రామం చేర్చడంతో పాటు ఆర్థిక సహాయం అందించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపింది.

## భూముల ధరల పెంపు నిర్ణయం

## రిజిస్ట్రేషన్లకు భారీగా డిమాండ్

**హైదరాబాద్, మే9 :** భూముల ధరల సవరణ నిర్ణయంతో తెలంగాణలో రిజిస్ట్రేషన్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. స్థిరాస్తుల మార్కెట్ విలువ పెంచేందుకు కసరత్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విలువలు పెరగకముందే రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ప్రజలు చొరవ చూపుతున్నారు. ఈ నెల 12 నుంచి 15 వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అదనంగా పని చేయనున్నాయి. ఆయా రోజుల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు పనివేళలుగా ప్రభుత్వం నిర్ణయించింది. రిజిస్ట్రేషన్లకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్బీ నగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్వో, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ కార్యాలయాల్లో అదనపు పనివేళలు ఉంటాయని ప్రభుత్వం తెలిపింది. అవసరమైతే మరింత సమయం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొంది. స్లాట్ బుకింగ్‌ల సంఖ్య పెంచాలని అధికారులను ఆదేశించింది.


## నిజామాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం..

**నిజామాబాద్, మే9 :** నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఓ ఇసుక లారీ.. ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 15 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఘటనపై విచారణ చేస్తున్నారు. ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.

# వనరుల గనిలో ఉపాధి శూన్యం

- పాలకుల అసమర్థతపై గర్జించిన బుడగం నాగేశ్వరరావు!
- ఖనిజాల గని భద్రాద్రి.. నేతలకే 'సిరి', జనం గతేమిటి?

కొత్తగూడెం మే 09 (జన సంఘర్షణ)



అపారమైన ఖనిజ సంపదకు నిలయమైన భద్రాద్రి జిల్లాలో వనరులు ఉన్నా, వాటిని స్థానిక ఉపాధిగా మార్చడంలో నేటి పాలకులు ఘోరంగా విఫలమవుతున్నారని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ భద్రాద్రి జిల్లా కన్వీనర్, ప్రముఖ ఉద్యమనేత బుడగం నాగేశ్వరరావు మండిపడ్డారు. నాటి పాలకులు జిల్లాలో కొన్ని పరిశ్రమలైనా స్థాపించి వేల మందికి ఉపాధి కల్పించారని, కానీ నేటి పాలకులు మాత్రం ఆ దిశగా కనీస ఆలోచన చేయని మూర్ఖత్వంలో ఉన్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితమైన అభివృద్ధి, క్షేత్రస్థాయిలో నిరుద్యోగుల పాలిట శాపంగా మారిందని ఆయన విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చాక సామాన్యుడిని అరిగోస పెడుతున్నారని నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. నాయకులు ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతూ కోట్లకు పడగలెత్తుతుంటే, సామాన్య ప్రజలు మాత్రం రోజురోజుకూ ఆర్థికంగా చితికిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పదవుల కోసం ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టే అసమర్థ నాయకత్వం వల్ల జిల్లా భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతోందని ఆయన సూటిగా విమర్శించారు. భద్రాద్రి జిల్లాలో ఉన్న అపారమైన అటవీ, ఖనిజ వనరులను ఉపయోగించుకుని పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్థానిక యువతకు వలస కష్టాలు తప్పుతాయని, కానీ పాలకులకు ఆ చిత్తశుద్ధి లేదని ఆయన పేర్కొన్నారు. కేవలం తమ ఆస్తులను పెంచుకోవడంపై ఉన్న శ్రద్ధ, ప్రజా సంక్షేమంపై లేదని, ఈ దోపిడీ వ్యవస్థపై ప్రజలు నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రశ్నించే గొంతుకలు మూగబోతే, పాలకుల ఆగడాలకు అడ్డు అదుపు ఉండదని ఆయన హెచ్చరించారు. ప్రజలు తిరగబడితేనే బతుకులు బాగుపడతాయని, రాబోయే తరాలకు మెరుగైన భవిష్యత్తు అందించాలంటే పోరాటం తప్పదని ఈ ఉద్యమనేత స్పష్టం చేశారు. హక్కుల కోసం చేసే యుద్ధంలో ప్రజలంతా ఏకం కావాలని, అప్పుడే పాలకుల మెడలు వంచి జిల్లా అభివృద్ధిని సాధించుకోగలమని నాగేశ్వరరావు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రజా క్షేత్రంలో పాలకుల అసమర్థతను ఎండగడుతూ, భవిష్యత్ కార్యాచరణను ప్రకటించడమే లక్ష్యంగా ఆయన తన గళాన్ని వినిపించారు.

## అన్నదాతల కళ్లల్లో ఆనందం: సుదిమళ్ళలో కోటితో 'దారి' చూపిన ఎమ్మెల్యే!





ఇల్లందు మే 08 (జన సంఘర్షణ)

అభివృద్ధి అంటే కేవలం నగరాల్లో అద్దాల మేడలు కట్టడం కాదు, మట్టిని నమ్ముకున్న రైతు పాదం చిక్కుకోకుండా పొలానికి వెళ్లే 'దారి' చూపడమే అసలైన పురోభివృద్ధి అని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మరోసారి నిరూపించారు. ఇల్లందు మండలం సుదిమళ్ళ గ్రామ పంచాయతీ పరిధిలో ఏళ్ల నాటి రైతుల కష్టాలను తీరుస్తూ, ఒక కోటి రూపాయల భారీ వ్యయంతో ఐదు గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి ఆయన శ్రీకారం చుట్టారు. కేవలం శిలాఫలకాలకు పరిమితం కాకుండా, పంట పొలాలకు వెళ్లే మార్గాలను సుగమం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది వేశారు. ఈ పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే స్వయంగా పాల్గొని టెంకాయ కొట్టి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించడం, ప్రజా సంక్షేమం పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి అద్దం పడుతోంది. మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం సుదిమళ్ళ ముఖచిత్రాన్ని మార్చడమే కాకుండా, పాలకుల ఆలోచన రైతు బాగు కోసమే ఉండాలని చాటిచెబుతోంది.

## పొలాల బాటలో ప్రజాప్రతినిధి: రైతు క్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పర్యటన!

భద్రాచలం మే 09 (జన సంఘర్షణ)

భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు నేడు దుమ్ముగూడెం మండలం పెద్దనల్లబల్లి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా క్షేత్రస్థాయికి వెళ్లిన ఆయన, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను స్వయంగా పరిశీలించారు. ఏసీ గదులకే పరిమితం కాకుండా, ఎండను సైతం లెక్కచేయక నేరుగా పొలాల్లో పని చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి, వారితో ముఖాముఖి మాట్లాడటం విశేషం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులను రాజులుగా చూడాలనే సంకల్పంతో ఉందని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. నీటిపారుదల వనరులను మెరుగుపరచడం ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రైతులకు భరోసా ఇచ్చారు. ప్రజా క్షేమమే పరమావధిగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. అభివృద్ధి కేవలం కాగితాల మీద కాకుండా క్షేత్రస్థాయిలో రైతు కళ్లలో ఆనందం చూసినప్పుడే సాధ్యమని ఈ పర్యటన ద్వారా ఆయన చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు ప్రజల మధ్యకు వచ్చి వారి కష్టనష్టాలను తెలుసుకోవడం నిజమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనమని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





## పేదల కల 'ఇందిరమ్మ ఇల్లు'.. క్షేత్రస్థాయిలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పర్యవేక్షణ

ఇల్లందు మే 09 (జన సంఘర్షణ)



ఇల్లందు మున్సిపాలిటీలో అర్హులైన ప్రతి పేదవాని సొంతింటి కల నెరవేరాలనే లక్ష్యంతో, ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా శనివారం 4వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ కౌన్సిలర్ ఎండి కుష్బూ తో కలిసి ఇంటింటికీ వెళ్లి నిర్మాణాల పురోగతిని స్వయంగా పరిశీలించారు. ఏళ్ల తరబడి అసంపూర్తిగా నిలిచిపోయిన గృహాలు, ఆర్థిక ఇబ్బందుల వల్ల పనులు ప్రారంభించలేని లబ్ధిదారుల స్థితిగతులను అడిగి తెలుసుకున్న చైర్‌పర్సన్, ఈ సమస్యలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కేవలం నిధుల కేటాయింపుతో సరిపెట్టకుండా, లబ్ధిదారుడి గడప వరకు వెళ్లి సమస్యలను గుర్తించడం పాలకుల బాధ్యత అని, అర్హులైన ఏ ఒక్కరూ సొంతింటికి దూరం కాకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండి జాఫర్, కోఆప్షన్ సభ్యులు ఆజా, ఇతర నేతలు పాల్గొని, పారదర్శకమైన గృహ నిర్మాణ ప్రక్రియకు తమ మద్దతు ప్రకటించారు.

## సింగరేణి కొలువుల పిలుపు: మణుగూరు స్కూల్‌లో ఉద్యోగాల జాతర!




మణుగూరు మే 09 (జన సంఘర్షణ)

మణుగూరు సింగరేణి పాఠశాలలో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కావడం నిరుద్యోగ యువతకు ఒక గొప్ప అవకాశంగా మారింది. ఒప్పంద ప్రాతిపదికన తెలుగు, హిందీ, గణితం సబ్జెక్టులతో పాటు పీఈటీ, నాలుగో తరగతి సిబ్బంది నియామకానికి టీబీజీకేఎస్ నేత నాగెల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటలలోపు తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉండగా, జూన్ 4న ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తారు. కేవలం ఒక ఉద్యోగం పొందడమే కాకుండా, సింగరేణి విద్యా సంస్థల్లో భాగమై భావి తరాలను తీర్చిదిద్దే ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం పీవీ కాలనీ పాఠశాలను సంప్రదించాలని కోరుతున్నారు. పాలకుల చుట్టూ తిరగడం కంటే, ప్రతిభను నమ్ముకుని ఇలాంటి నోటిఫికేషన్లను అందిపుచ్చుకోవడమే నిరుద్యోగుల అసలైన గెలుపు.

## అంబేద్కరిజం అంటే విగ్రహం కాదు.. ఒక జీవన మార్గం

- కొమరారంలో ప్రొఫెసర్ ఖాసీం గర్జన!



ఇల్లందు మే 09 (జన సంఘర్షణ)

ఇల్లందు మండలం కొమరారం గ్రామంలో నేడు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవం సామాజిక చైతన్యానికి వేదికైంది. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీం, బాబాసాహెబ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కరిజం అనేది కేవలం ఒక విగ్రహానికో లేదా పూలమాలకో పరిమితం కాదని, అది అణచివేతకు గురవుతున్న ప్రతి గొంతుకకు ఒక ధైర్యమని, సమాజ మార్పునకు అదొక నిరంతర జీవన మార్గమని ఉద్ఘాటించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడం ద్వారానే బహుజన సమాజం అభివృద్ధి చెందుతుందని ఖాసీం పేర్కొన్నారు. నేటి తరం యువత విద్యను ఆయుధంగా మలచుకోవాలని, ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకున్నప్పుడే అసమానతలు లేని సమాజం సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. అఖిలపక్ష పార్టీలు తమ రాజకీయ విభేదాలను పక్కన పెట్టి, ఒక సామాజిక విప్లవకారుడి గౌరవార్థం ఏకతాటిపైకి రావడం కొమరారం గ్రామ చైతన్యానికి నిదర్శనమని ఆయన కొనియాడారు. కేవలం భౌతికమైన విగ్రహ ప్రతిష్టతో సరిపెట్టకుండా, అంబేద్కర్ రాసిన రాజ్యాంగ స్ఫూర్తిని ఇంటింటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ బహిరంగ సభలో అఖిలపక్ష నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, పరిసర గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సభకు హాజరైన యువతను ఉద్దేశించి ఖాసీం చేసిన ప్రసంగం ఆద్యంతం ఆలోచింపజేసేలా సాగింది. అధికారం, ఆస్తుల కంటే విజ్ఞానమే శాశ్వతమైనదని, అంబేద్కరుని అడుగుజాడల్లో నడిచి సామాజిక న్యాయం కోసం పోరాడాలని ఆయన దిశానిర్దేశం చేశారు. మంగళవాయిద్యాలు, జై భీమ్ నినాదాల మధ్య జరిగిన ఈ కార్యక్రమం కొమరారంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

## నిజామాబాద్ జిల్లాలో గుట్కాపై చీత ఫోర్స్ మెరుపు దాడి

- అందజా 30 లక్షల విలువ చేసే గుట్కా ప్యాకెట్లు స్వాధీనం : పోలీస్ కమీషనర్ వెల్లడి

బోధన్, మే 09 జన సంఘర్షణ



శనివారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు సి.సి.ఎస్ ఏసీపీ ఇంచార్జ్ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో చీత ఫోర్స్ బోధన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆచన్‌పల్లి గ్రామంలో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎచ్‌కేజిఎన్ షాప్ డంప్‌తో పాటు ఎచ్‌కేజిఎన్ మటన్ షాప్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ మొత్తంలో గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గుట్కా సరుకుల అంచనా విలువ సుమారు రూ.30 లక్షలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన గుట్కా, నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలు, నిల్వలు, రవాణాపై పోలీస్ శాఖ కఠిన చర్యలు కొనసాగిస్తుందని అధికారులు హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న గుట్కా సరుకును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం బోధన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కి అప్పగించినట్లు తెలిపారు.

## భద్రాద్రి తీరాన విషాదం: గోదావరి ఒడిలో ప్రాణాలు విడిచిన హనుమాన్ మాలధారి

భద్రాచలం మే 09 (జన సంఘర్షణ)

పుణ్యక్షేత్రమైన భద్రా చలంలో విషాదం చోటు చేసుకుంది. గోదా వరి స్నానాల రేవు వద్ద హనుమాన్ మాల ధారణలో ఉన్న ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమవ్వడం స్థానికంగా కలకలం రేపింది.



పవిత్రమైన మాల వేసుకుని, స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తుడు ఇలా విగతజీవిగా కనిపించడం అందరినీ కలిచివేస్తోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం, సదరు వ్యక్తి పుణ్యస్నానం ఆచరిస్తున్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటు (ఫిట్స్ లేదా పీడిచు) రావడంతో నీటిలో మునిగి మరణించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. భక్తి పారవశ్యంలో మునిగి, దైవ సన్నిధికి చేరువవ్వాలనుకున్న ఆ యాత్రికుడు, అనంత లోకాలకు వెళ్ళిపోవడం వెనుక ఉన్న కారణాలపై విచారణ జరుగుతోంది. ఆ గుర్తుతెలియని వ్యక్తి ఎవరు? ఏ ప్రాంతం నుండి వచ్చారు? అనే వివరాలు తెలియాల్సి ఉంది. నిరంతరం భక్తులతో కిటకిటలాడే గోదావరి తీరంలో భద్రత, తక్షణ వైద్య సదుపాయాల అవశ్యకతను ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం · తెలుగు దినపత్రిక
ఆదివారం 10 మే 2026

## బోడులో ఆధ్యాత్మిక వైభవం: బొడ్రాయి, ముత్యాలమ్మ ప్రతిష్టలో ఎమ్మెల్యే కోరం కనకయ్య!





టేకులపల్లి మే 09 (జన సంఘర్షణ)

టేకులపల్లి మండలం బోడు గ్రామంలో ఆధ్యాత్మిక పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులంతా ఏకమై అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ సరిహద్దు వద్ద ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికిన గ్రామస్తులు, మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరిపై చల్లని చూపు ఉండాలని వేడుకున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు కోరం సురేందర్ కూడా పాల్గొని సందడి చేశారు. పల్లెల్లో బొడ్రాయి ప్రతిష్ట అనేది కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదని, అది గ్రామ రక్షణకు, ఐక్యతకు ప్రతీక అని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టేకులపల్లి సి.ఐ బత్తుల సత్యనారాయణ, ఎస్.ఐలు రాజేందర్, శ్రీనివాస్ రెడ్డి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడంలో గ్రామీణ ప్రాంతాలు ఎప్పుడూ ముందుంటాయని, ఇలాంటి ఉత్సవాలు మనుషుల మధ్య బంధాలను బలపరుస్తాయని ఎమ్మెల్యే కనకయ్య అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నేతలు ఈది గణేష్, పోశాలు, సర్దార్, సుధీప్ సహా స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణలు, భక్తుల కోలాహలం మధ్య బోడు గ్రామం భక్తి పారవశ్యంలో మునిగితేలింది.

## 'వికసిత భారత్' లక్ష్యంగా పరేడ్ గ్రౌండ్స్ గర్జన..

❑ చలో హైదరాబాద్ అంటున్న బూర్గంపాడు!

మే 09 (జనసంఘర్షణ)

వికసిత భారత నిర్మాణమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఈ నెల 10న తెలంగాణ గడ్డపై అడుగుపెడుతున్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ బూర్గంపాడు మండలంలో బీజేపీ శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహించాయి. రాష్ట్ర నాయకులు ఏనుగుల వెంకటరెడ్డి, కన్యదారి వరప్రసాద్, గుగ్లోత్ బాలునాయక్ తదితరులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రజలను కోరారు. ఈ పర్యటన కేవలం రాజకీయ సభకు మాత్రమే పరిమితం కాకుండా, తెలంగాణకు రూ. 7,823 కోట్ల విలువైన అభివృద్ధి కానుకలను ప్రధాని అందించనున్నారు. ముఖ్యంగా జహీరాబాద్ స్మార్ట్ సిటీ, జాతీయ రహదారుల విస్తరణ, కాజీపేట-విజయవాడ రైల్వే లైన్ల వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయనుండటం రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త ఊపిరి పోయనుంది. గత 12 ఏళ్లలో దాదాపు రూ. 12 లక్షల కోట్ల నిధులను మంజూరు చేసి, తెలంగాణ మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుందని నేతలు ఈ సందర్భంగా గుర్తు చేశారు. "దేశం కోసం మోడీ.. మోడీ కోసం మనం" అనే నినాదంతో ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ బహిరంగ సభకు భద్రాద్రి జిల్లా నుండి భారీ సంఖ్యలో జన సమీకరణ చేసేలా వ్యూహాలు సిద్ధం చేశారు. కులమతాలకు అతీతంగా 'సబ్కా సాత్-సబ్కా వికాస్' నినాదంతో సాగుతున్న పాలనపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ




ప్రచారాన్ని నిర్వహించారు. ప్రధాని మోడీ ప్రసంగం ద్వారా తెలంగాణ రాజకీయాల్లో మరియు అభివృద్ధిలో ఎలాంటి నూతన దిశానిర్దేశం లభిస్తుందోనని అటు రాజకీయ వర్గాలు, ఇటు సామాన్య ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## అన్నదాత అరిగోస: పాలకుల సంబరాలు.. రైతుల కన్నీళ్లు

❑ "ధాన్యం కొనకుంటే సర్కార్ ఆఫీసులు స్తంభింపజేస్తాం


❑ బీఆర్ఎస్ నేత సత్యనారాయణ నాయక్ హెచ్చరిక"

కొత్తగూడెం మే 09 (జన సంఘర్షణ)

ఒకవైపు అకాల వర్షాలు కళ్ళాల్లో ఉన్న ధాన్యాన్ని తడుపుతుంటే, మరోవైపు ప్రభుత్వ నిబంధనల కొర్రీలు రైతు గుండెను పిండేస్తున్నాయి. చెమటోడ్చి పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాతలు నెల రోజులుగా రోడ్లపై పడిగాపులు కాస్తుంటే, పాలకులు మాత్రం 'ప్రజా పాలన' పేరుతో ఉత్సవాల్లో మునిగి తేలడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని బిఆర్ఎస్ పార్టీ సుజాతనగర్ మండల అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ నాయక్ నిప్పులు చెరిగారు. జిల్లా నుంచి రాష్ట్ర కేబినెట్‌లో ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా, క్షేత్రస్థాయిలో రైతు పరిస్థితి 'అడవిలో కాసిన వెన్నెల' చందంగా మారింది. అధికార బలం జిల్లాకు లాభం చేకూర్చాల్సింది పోయి, సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుండటంతో ఇది ప్రజలకు శాపంగా మారిందని నాయక్ విమర్శించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ధాన్యం సేకరణలో చూపిస్తున్న నిర్లక్ష్యం, రైతులను దళారుల చేతికి చిక్కేలా చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "పంటలు కొనడం చేతగాని ప్రభుత్వం పండుగలు చేసుకోవడం సిగ్గుచేటు" అంటూ సత్యనారాయణ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 రోజులుగా కళ్ళాల్లోనే ధాన్యం కుప్పల వద్ద రైతులు అరిగోస పడుతుంటే, వారోత్సవాల పేరుతో కోట్లు ఖర్చు చేయడం పాలకుల విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. రైతు కళ్ళల్లో ఆనందం చూడాల్సిన ప్రభుత్వం, వారి కన్నీళ్లను విస్మరించి ఉత్సవాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి వీడి, ఎటువంటి షరతులు లేకుండా ధాన్యం మొత్తాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని నాయక్ డిమాండ్ చేశారు. రైతుల సహనాన్ని పరీక్షించవద్దని, ధాన్యం సేకరణలో జాప్యం కొనసాగితే సుజాతనగర్ ప్రభుత్వ కార్యాలయాన్ని స్తంభింపజేసి పెద్ద ఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు. పాలకుల ప్రచార ఆర్భాటం పక్కన పెట్టి, రైతు గుండె ఘోషను ఆలకించాలని ఆయన డిమాండ్ చేశారు.



## ప్రధాని నరేంద్ర మోడీ భాగ్యనగర్ పర్యటన నేపథ్యంలో సమావేశం




రుద్రూర్ ఉమ్మడి మండలాలు/మే 9/(జన సంఘర్షణ

ప్రధాని నరేంద్ర మోడీ భాగ్యనగర్ పర్యటన నేపథ్య ంలో ఈ రోజు రుద్రూర్, పొతంగల్, వర్ని, కోటగిరి, మోస్రా, చింతకుంట మండల నాయకులతో సన్నాహక సమావేశం, పత్రికా విలేకరుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇందూరు జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్, జిల్లా ఉపాధ్యక్షులు కందగట్ల రామచందర్, బాన్సువాడ నియోజక వర్గం నాయకులు శశాంక్ కోనేరు, జిల్లా కౌన్సిల్ మెంబర్ సున్నం సాయిలు, ప్రశాంత్ గౌడ్, ఎల్లామ్ శంకర్, మండల అధ్యక్షులు, (బజరంగ్) హనుమాన్లు, ఏమూల నవీన్, ఆలపాటి హరికృష్ణ , ఆవుల రమేష్, మోస్రా సర్పంచ్ భూపాల్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు బీవీ గుప్తా, చిదురా మహిపాల్, కటిక రామరాజు,ఏముల గజేందర్, బోజిగొండ అనిల్, వడ్ల సాయినాథ్,కుమ్మరి గణేష్, శ్రీనివాస్, తోట శంకర్, పార్వతి మురళి, శివప్రసాద్, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## ఇద్దరికీ వ్యక్తులు ప్రవీణ్ గౌడ్, షేక్ ముజీబ్, రిమాండ్‌కు తరలింపు

❑ కోటగిరి ఎస్సై



పోతంగల్/మే 9/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని పోతంగల్ గ్రామ నివాసి గంధపు దత్తు అనే వ్యక్తిపై దాడి చేసినందుకు 11 మంది వ్యక్తులపై కేసు నమోదు. ఈ సంఘటన 08 ఏప్రిల్ రాత్రి 11 గం ముఖ్య నిందితులు ఇతడిని ఇప్పటికే పంజాల ప్రవీణ్ గౌడ్, ఎస్ కె ముజీబ్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మిగిలిన నిందితులు పరారీలో ఉన్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు. పంజా మహేందర్, పంజా గోవింద్, గంధపు రాజు, గంధపు గంగారాం, రజాక్, లింగ గౌడ్, సుభాష్, ముత్యాల భాగయ్య పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది అని ఎస్సై సునీల్ తెలిపారు.

## భద్రాద్రి సాక్షిగా మానవత్వం

❑ రూ. 3.5 లక్షల బంగారు బ్రాస్లెట్ అప్పగించిన 'నిజాయితీ'

భద్రాచలం మే 09 (జన సంఘర్షణ)





కలియుగ వైకుంఠం భద్రాద్రి రామయ్య సన్నిధిలో భక్తితో పాటు మానవత్వం కూడా పరిమళించింది. రాజమండ్రికి చెందిన వీర బ్రహ్మానంద స్వామి అనే భక్తుడు శనివారం రామయ్య దర్శన సమయంలో తన మూడున్నర లక్షల రూపాయల విలువైన బంగారు బ్రాస్లెట్‌ను పోగొట్టుకోగా, అది దొరికిన కొత్తగూడెం వాసి వెంకటేశ్వర్లు తన నిజాయితీని చాటుకున్నారు. స్థానికుడైన జి. వెంకటేశ్వరరావు సహకారంతో ఆ విలువైన నగను వెంటనే దేవస్థానం అధికారులకు అందజేశారు. లోకం మొత్తం స్వార్థంతో నిండిపోతున్న వేళ, పరుల సొమ్ము పాము వంటిదని భావించి.. ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, ఎస్పీఎఫ్ సిబ్బంది సమక్షంలో ఆ బ్రాస్లెట్‌ను అసలైన యజమానికి తిరిగి అప్పగించడం విశేషం. ఈ ఘటనపై అధికారులు స్పందిస్తూ, "ధనం కంటే ధర్మం గొప్పదని నిరూపించిన ఇలాంటి వ్యక్తులే సమాజానికి స్ఫూర్తి" అని అభినందించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే పుణ్యక్షేత్రాల్లో విలువైన వస్తువుల పట్ల అప్రమత్తత ఎంత అవసరమో, తోటి భక్తుడి కష్టంలో అండగా నిలిచే గుణం అంతకంటే అవసరమని ఈ ఉదంతం మనకు గుర్తుచేస్తోంది.

## బోధన్‌లో 60 ఈత చెట్లు కూల్చి కాల్చివేత

❑ గీత కార్మికుల ఆందోళన



బోధన్/మే 9/(జన సంఘర్షణ)

బోధన్ పట్టణంలోని పసుపు వాగు ప్రాంతంలో ఈత చెట్లను కూల్చి కాల్చివేసిన ఘటన గీత కార్మికుల్లో ఆందోళనకు దారితీసింది. ఈ ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గీత కార్మికులు బోధన్ ఎక్సైజ్ సీఐ భాస్కరరావుకు ఫిర్యాదు చేశారు. గీత కార్మిక సంఘం నాయకుల వివరాల ప్రకారం, సర్వే నంబర్ 594లో ఉన్న 8 ఎకరాల 6 గుంటల భూమి కల్లు గీత కార్మిక సంఘానికి చెందిన సొంత భూమి. ఈ భూమిలో ఈతవనం పెంచుతూ, ఈత కల్ల ద్వారా పలువురు గీత కార్మికులు ఉపాధి పొందుతున్నారు. శుక్రవారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఈతవనంలోకి ప్రవేశించి 50 నుంచి 60 ఈత చెట్లను కూల్చివేసి కాల్చివేశారని కార్మికులు ఆరోపించారు. ఈ ఘటన వల్ల తమకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని, ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పి. గంగాధర్ గౌడ్, బి. లింగా గౌడ్, కందుకాల శ్రీకాంత్ గౌడ్, వై. జీవన్ గౌడ్, వై. రమేష్ గౌడ్, ఎం. రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కల్లు గీత కార్మిక సంఘం నాయకులు, గీత కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

❑ కామారెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు యూత్ కాంగ్రెస్, అధ్యక్షులను నియమించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు.



కామారెడ్డి:/మే9/(జన సంఘర్షణ)

కామారెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు యూత్ కాంగ్రెస్, అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ఉత్తర్వులు విడుదల చేశారు.

**అధిష్టానం ఆదేశాల మేరకు..**

ఏఐసీసీ యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి సయ్యద్ ఖాలిద్ అహ్మద్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు, చేపట్టినట్టు మధుసూదన్ రెడ్డి తెలిపారు. కామారెడ్డి, అధ్యక్షుడిగా అజ్మత్, కామారెడ్డి మండల అధ్యక్షుడిగా హన్మాండ్ల రాంకుమార్, భిక్కనూరు మండల అధ్యక్షుడిగా శ్రీరామ్ వెంకటేష్, రాజంపేట అధ్యక్షుడిగా టి.ప్రభాకర్ గౌడ్, బీబీపేట అధ్యక్షుడిగా ఎం.మహేష్, దోమకొండ అధ్యక్షుడిగా పిన్నం నాగేంద్ర వర్మ, పాల్వంచ అధ్యక్షుడిగా సమరసింహా రెడ్డి, మాచారెడ్డి అధ్యక్షుడిగా రాజారెడ్డిలను నియమించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా నియామకమైన అధ్యక్షులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, యువతను ఏకం చేస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర నాయకత్వం, జిల్లా ఇన్‌ఛార్జీల పర్యవేక్షణలో వీరంతా సమన్వయంతో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి తోడ్పడతారన్నారు.

## సుంకిని శీను పటేల్ గోశాలకు సంబంధించిన గోవుల కోసం 200 గడ్డి కట్టలు పంపించిన దాత

◆ ఈరోజు బోధన్‌లోని ఏక చక్ర గోశాలకు పంపియడం

పొతంగల్ సుంకిని/మే9/(జన సంఘర్షణ)



గత వారం రోజుల క్రితం బోధన్ గోశాలలో గోవులకు సంబంధించినటువంటి గడ్డి కట్టలు అగ్ని ప్రమాదానికి గురి కావడం జరిగింది. దానిని దృష్టిలో పెట్టుకొని కోటగిరి గ్రామానికి చెందిన సుంకిని శీను పటేల్ గోశాలకు సంబంధించిన గోవుల కోసం 200 గడ్డి కట్టలు ఈరోజు బోధన్ లోని ఏక చక్ర గోశాలకు పంపియడం జరిగింది.

## రేపల్లెవాడ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన దిండిగాల రాజేందర్

◆ రైతులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నేతల డిమాండ్

ఇల్లందు ప్రతినిధి (జన సంఘర్షణ)



ఇల్లందు మండలం రేపల్లెవాడ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ అజ్మీర్ బౌసింగ్ నాయక్ ఆహ్వానం మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ ఫౌండర్ మెంబర్, మాజీ గ్రంథాలయాల సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్ ఈరోజు బీఆర్ఎస్ పార్టీ బృందంతో కలిసి సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి వారి గోడును విన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సకాలంలో ధాన్యం సేకరణ జరగడం లేదని, రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తార్పాలిన్లు, సరైన వసతులు లేక ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం వర్షాలకు తడిసిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కొనడం లేదని, బస్తాకు తరుగు తీస్తున్నారని, గన్నీ బ్యాగులు సరఫరా చేయడం లేదని, మార్కెట్ ధర కంటే తక్కువ ధర చెల్లిస్తున్నారని ఆరోపించారు. మార్కెట్‌లో దళారీల రాజ్యం కొనసాగుతుందని, రైతుల పొట్టగొట్టి లాభాలు గడిస్తున్నారని, మార్కెట్ కమిటీ అధికారులు దళారీలకే సహకరిస్తున్నారని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ.. గతంలో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులకు ఇటువంటి ఇబ్బందులు ఉండేవి కాదన్నారు. గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసేవారని, తడిసిన రంగు మారిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుల కష్టాలు పెరిగిపోయాయని విమర్శించారు. రైతుబంధు సకాలంలో రావడం లేదని, విత్తనాలు, యూరియా కొరత ఏర్పడిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నా చేతలు గడప దాటడం లేదని విమర్శించారు. వెంటనే మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్, పీఏసీఎస్ సీఈఓలతో మాట్లాడి రైతులకు న్యాయం చేయాలని, ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని, దళారీల వ్యవస్థను అరికట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు జబ్బర్, మాజీ ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ, మాజీ ఎంపీపీ ప్రమోద్, మాజీ మండల ఉపాధ్యక్షుడు దేరింగుల పోషం, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఘాజీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మూడు కృష్ణ ప్రసాద్, సత్యనారాయణ, నారపాక వసంతరావు, స్థానిక సర్పంచులు వేప శంకర్, ఎట్టి రమణ, ఉద్యమకారులు ఆధురి రవి, రాంలాల్ పాసి, రాచపల్లి శ్రీను, సుందరి శ్రీను, వాసు, సునీల్, మూలగుండ్ల ఉపేందర్ రావు, లలిత్ కుమార్ పాసి, శ్రీకాంత్, హరి ప్రసాద్ యాదవ్, సురేష్, కామేపల్లి ఉదయ్, గడ్డి శ్రీను, చిన్నారి, ముత్తయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పలమనేరు బుల్లెట్ రైలు పోరాటం : కేంద్రం నుండి తొలి స్పందన!

పలమనేరు, మే 09 (జన సంఘర్షణ) :




పలమనేరులో బుల్లెట్ రైలు స్టాప్ సాధన కోసం గత నెలలో పలమనేరు పరిరక్షణ సమితి (పిపిఎస్) ఆధ్వర్యంలో ప్రజా సంఘాల సహకారంతో నిర్వహించిన భారీ ర్యాలీ, ఉద్యమ ప్రయత్నాలకు తొలి ఫలితం దక్కింది. పట్టణ ప్రజల ఆకాంక్షను ప్రతిబింబిస్తూ పిపిఎస్, ప్రధానమంత్రి కార్యాలయానికి పంపిన వినతిపత్రంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ సందర్భంగా స్థానిక ఎన్జీఓ హోం నందు శనివారం నిర్వహించిన సమావేశంలో పిపిఎస్ అధ్యక్షులు టి.ఎల్. నరసింహులు మాట్లాడుతూ... "మనం పంపిన విన్నపం రైల్వే బోర్డులోని 'ఎఫిషియెన్సీ అండ్ రీసెర్చ్' విభాగానికి చేరి, ప్రస్తుతం అధికారుల పరిశీలనలో ఉంది అని అధికారికంగా ప్రధాన మంత్రి కార్యాలయం నుండి పిపిఎస్ కు లేఖ అందినట్లు తెలిపారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వంలో ప్రక్రియ ప్రారంభం కావడం శుభ పరిణామమని తెలిపారు.

# అన్నదాతల నిప్పుల కొలిమిలో ధాన్యం కేంద్రాలు

◆ పాలకుల నిర్లక్ష్యంపై రాజేందర్ నిప్పులు

ఇల్లందు మే 09 (జన సంఘర్షణ)



భద్రాద్రి జిల్లా ఇల్లందు మండలం రేపల్లెవాడ ధాన్యం కొనుగోలు కేంద్రం నేడు రాజకీయ రణరంగంగా మారింది. రైతుల కష్టాలను స్వయంగా చూసేందుకు బీఆర్ఎస్ నేత, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్ తన అనుచర వర్గంతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. కేంద్రానికి చేరుకున్న రాజేందర్‌కు రైతులు తమ కన్నీటి గాథలను ఏకరువు పెట్టారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని, కనీసం తార్పాలిన్లు కూడా లేక అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల గోడు విన్న రాజేందర్ అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ధాన్యం సేకరణలో జరుగుతున్న జాప్యం వెనుక దళారీల హస్తం ఉందని ఆయన సూటిగా విమర్శించారు. మార్కెట్ ధర కంటే తక్కువ ధర చెల్లిస్తూ, గన్నీ బ్యాగుల కొరతను సాకుగా చూపుతూ బస్తాకు



తరుగు తీయడం వంటి చర్యలు రైతుల పొట్ట కొట్టడమేనని మండిపడ్డారు. మార్కెట్ కమిటీ అధికారులు నిబంధనల ప్రకారం పనిచేయకుండా, దళారీలకు కొమ్ముకాస్తూ రైతులను అరిగోస పెడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. గత కేసీఆర్ ప్రభుత్వానికి, నేటి కాంగ్రెస్ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ రాజేందర్ ఘాటైన విమర్శలు చేశారు. "గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులకు ఈ తిప్పలు లేవు. గిట్టుబాటు ధరతో పాటు, వర్షాలకు తడిసి రంగుమారిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసి అన్నదాతను అక్కున చేర్చుకుంది. కానీ నేడు పరిస్థితి దారుణంగా ఉంది. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నా, క్షేత్రస్థాయిలో రైతు గడప దాటి సాయం అందడం లేదని" ఆయన ఎద్దేవా చేశారు. రైతుబంధు రాదు, విత్తనాలు దొరకవు, యూరియా కోసం క్యూలో నిలబడాల్సిన దుస్థితి నేడు తెలంగాణలో నెలకొందని విమర్శించారు. రైతుల సమస్యలపై తక్షణమే స్పందించాలని కోరుతూ రాజేందర్ అక్కడి నుండే మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ మరియు పీఏసీఎస్ సీఈఓలతో ఫోన్లో మాట్లాడారు. నిబంధనల పేరుతో రైతులను వేధించడం ఆపాలని, వెంటనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. దళారీ వ్యవస్థను అరికట్టి రైతుకు న్యాయం చేయకపోతే తాము చూస్తూ ఊరుకోబోమని, రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని పాలకులను హెచ్చరించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అన్నదాత రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని, ఇది ఇలాగే కొనసాగితే ప్రజా పోరాటం తప్పదని రాజేందర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఇల్లందు పట్టణ, మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని రైతులకు మద్దతుగా నిలిచారు. పాలకుల అసమర్థతను ఎండగడుతూ రాజేందర్ చేసిన ఈ పర్యటన నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

# ఆర్టీసీ బస్సును.. ఢీ కొట్టిన ఇసుక టిప్పర్

◆ అనుమతికి మించి అధిక లోడుతో వెళ్తున్న టిప్పర్
◆ 15 మంది ప్రయాణికులకు గాయాలు
◆ ఇద్దరినీ నిజామాబాద్ ఆసుపత్రికి తరలింపు
◆ బడా పహాడ్ నుంచి వర్నికి వస్తున్న బస్సును ఢీ కొట్టిన ఇసుక టిప్పర్

వర్ని/మే 9/(జన సంఘర్షణ)

ముందే అతివేగం... దానికి తోడు అనుమతులు లేకుండా భారీగా ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పర్, ఆర్టిసి బస్సును ఢీకొట్టడంతో 15 మంది గాయాల పాలైన ఘటన నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే బడా పహాడ్ పుణ్యక్షేత్రం నుంచి భక్తులతో వర్ని ప్రాంతానికి వస్తున్న బస్సును, అధిక లోడుతో ఇసుక తీసుకు వెళుతున్న టిప్పర్ అతివేగంగా ఆర్టిసి బస్సుకు ఢీకొనడంతో బస్సులో ఉన్న 15 మంది భక్తులు తీవ్ర గాయాలకు గురయ్యారు. వీర్లో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండడంతో వీరిని నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు ఆగిన తర్వాత ఇసుక టిప్పర్ బలంగా ముందు బాగా నుంచి



ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బస్సుకు ఢీ కొట్టి లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఈ ఇసుక తీసుకుపోవడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవని తెలుస్తుంది. మధ్యాహ్నం పూట కొంతమంది అధికారుల అండదండలతో భారీగా ఇసుక నింపుకొని టిప్పర్ వేగంగా వెళ్లి ,ఆగిన ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. ఈ సమయంలో టిప్పర్ డ్రైవర్ మద్యం తాగినట్లు తెలుస్తుంది. అతి వేగంగా నడపడమే ఈ ప్రమాదానికి కారణమని సమాచారం. ప్రస్తుతానికి లారీ డ్రైవర్ పరార్



లో ఉన్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ కు స్వల్పంగా గాయాలయ్యాయి. స్థానిక ఆసుపత్రిలో చికిత్సలు చేసి క్షతగాత్రులను ఇంటికి పంపించారు. ఇద్దరి నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. వర్ని పోలీసులు సంఘటన స్థలముకు వెళ్లి ప్రమాదం గల కారణాలను ఆరా తీస్తున్నారు. ఇసుక టిప్పర్‌కు తీసుకువెళ్ళడానికి ప్రభుత్వ అనుమతి ఉందా లేదా అన్నది లారీ డ్రైవర్ పట్టుబడితే విషయాలన్నీ బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మోడీ సభ నుంచి బండి సంజయ్ ఔట్..!


కరీంనగర్/మే9/ (జన సంఘర్షణ)

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొనే సభకు బండి దూరమయ్యారు.

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొనే సభకు బండి దూరమయ్యారు. బీజేపీ పెద్దలు, స్థానిక నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొనే ఈ కార్యక్రమంలో ఎంపీకి చోటు దక్కలేదు. మోడీ సభకు ఆహ్వానితుల జాబితాలో బండి పేరు లేదు. ఎందుకంటే.. బండి సంజయ్ కుమారుడు పోక్సో, కేసులో ఇరుక్కోవడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఒకవేళ కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి అయిన బండి సంజయ్‌ను సభకు ఆహ్వానిస్తే అభాసుపాలవ్వడం తప్పదని భావించి బీజేపీ నాయకత్వం ఆయనను పక్కన పెట్టేశారనే వార్తలు వినిపిస్తున్నాయి. తెలంగాణ బీజేపీలో తన మార్క్ రాజకీయం నడిపే బండి సంజయ్‌కు దిమ్మతిరిగే షాక్. ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ సభలో ఎన్నో గొప్పలు చెప్పాలని కలలు కన్న బండి అనూహ్యంగా సభకు దూరమయ్యారు. కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసు నమోదవ్వడంతో ఆహ్వానితుల జాబితాలో ఆయనకు చోటు దక్కలేదు.

**వీళ్లకే ఆహ్వానం**

ప్రధాని సభకు గవర్నర్ ప్రతాప్ శుక్లా, సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ సురేశ్ గోపీ, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలను మాత్రమే ఆహ్వానించారు. ఆదివారం సికింద్రాబార్ పరేడ్ గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటల నుంచి మొదలవ్వనుంది.




**బలవంతంగా మద్యం తాగించి**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, తెలంగాణ భారతీయ జనతా పార్టీ కీలక నేత బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఒక 17 ఏళ్ల బాలికకు బలవంతంగా మద్యం తాగించి, హైదరాబాద్‌లోని మొయినాబాద్ ఫామ్‌హౌస్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వేధింపుల కారణంగా బాధితురాలు రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సమాచారం. చివరికి నిన్న అర్ధరాత్రి ఆమె పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే, మొదట్లో బండి భగీరథ్‌పై కేసు నమోదు చేసేందుకు పోలీసులు వెనుకాడటంతో పోలీస్ స్టేషన్ వద్ద సుమారు ఆరు గంటల పాటు హైడ్రామా చోటుచేసుకుంది. ఆ తర్వాత బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
శనివారం
09 మే 2026

# బంగారు దుకాణాలలోని డిజిటల్ తూకం మిషన్లను తనిఖీ చేసిన అధికారులు




**సూళ్లూరుపేట మే 8 2026 జన సంఘర్షణ :**
తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ టీం స్వామి ఆధ్వర్యంలో బంగారు షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. బంగారం కొనుగోలు, అమ్మకాల లావాదేవీలు, బిల్లుల నిర్వహణ, రిజిస్టర్ వివరాలు, వినియోగదారుల రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీలలో వ్యాపారులు ఉపయోగిస్తున్న డిజిటల్ తూకం మిషన్ల వినియోగం లోపాలను తనిఖీ చేసి యజమానులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద లావాదేవీలు, సరైన పత్రాలు లేకుండా జరుగుతున్న కొనుగోళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. కొన్ని దుకాణాల్లో కొనుగోలు బిల్లులు, జీఎస్టీ రికార్డులు, పాత బంగారం మార్పిడి వివరాలను అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ డిపార్ట్మెంట్ అధికారులు హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీలు సూళ్లూరుపేట పట్టణంలోని అన్ని బంగారం దుకాణాలలో నిర్వహించడం జరుగుతుందని, ఈరోజు బంగారు షాపు మూసి వేసినా మళ్లీ ఏదో ఒక రోజు కచ్చితంగా తనిఖీ చేయడం జరుగుతుందని అధికారులు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని, వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని విజిలెన్స్ అధికారులు సహకరించాలని తెలిపారు.

# ఇంటి తాళాలు వేసి దొంగతనాలకు పాల్పడిన నిందితుడి అరెస్ట్

- **రూ.18 లక్షల 50 వేల నగదు, 126 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం.**
- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా పోలీసుల విజ్ఞప్తి.**



**తిరుపతి/ మే 08/ జన సంఘర్షణ :**
తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు ఇంటి తాళాలు వేసి ఉన్న సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి, భారీ మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి క్రైమ్ పోలీస్ స్టేషన్ నందు అదనపు ఎస్పీ (క్రైమ్స్) వివరాలు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడు నెహ్రూ నగర్ తిరుపతికి చెందిన ఉల్కెష్, (27)గా గుర్తించారు. నిందితుడు గత కొంతకాలంగా విలాసాలకు బానిసై, తిరుపతి నగర పరిసర ప్రాంతాల్లో ఇంటి యజమానులు బయటకు వెళ్లిన సమయాలను గమనించి, తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు 2024 సంవత్సరంలో తిరుపతి నగర పరిధిలో మొత్తం ఆరు చోరీ కేసులకు పాల్పడినట్లు అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి మొత్తం రూ.18,50,000 నగదు, సుమారు 126.135 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో బంగారు గొలుసులు, ఉంగరాలు, బంగారు చైన్లు, లక్ష్మీ డాలర్ చైన్, చెవిపోగులు, ఇతర బంగారు వస్తువులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి, నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. దర్యాప్తు కొనసాగుతోందని, ఈ నేరాలకు సంబంధించి మరిన్ని వివరాలను సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు. ముఖ్యంగా అదనపు ఎస్పీ (క్రైమ్స్) పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది సమన్వయంతో వేగంగా దర్యాప్తు నిర్వహించి కేసును విజయవంతంగా ఛేదించారు. ప్రజలు తమ ఇళ్లను కొంతకాలం ఖాళీగా వదిలి వెళ్లే సందర్భాల్లో పొరుగువారికి సమాచారం ఇవ్వడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం లేదా పోలీసువారికి సమాచారం ఇచ్చిన ఎల్ హెచ్ ఎం ఎస్ కెమెరాలను ఉచితంగా ఏర్పాటు చేస్తామని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని తిరుపతి జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.


# గంజాయి మత్తుగాళ్లపై పోలీసుల 'సర్జికల్ స్ట్రైక్'

- **అత్యాధునిక కిట్లతో రంగంలోకి 'సూళ్లూరుపేట' పోలీసులు!**
- **తనిఖీల్లో ముగ్గురికి పాజిటివ్.. గంజాయి బ్యాచ్ గుండెల్లో వణుకు పుట్టిస్తున్న 'నయా టెస్టింగ్'**
- **జిల్లాను గంజాయి రహితంగా మార్చడమే లక్ష్యం - జిల్లా ఎస్పి హెచ్చరిక.**

**సూళ్లూరుపేట, మే 8 జన సంఘర్షణ :**
నియోజకవర్గంలో యువత భవిష్యత్తును చిదిమేస్తున్న గంజాయి మహమ్మారిని వేళ్లతో సహా పెకిలించేందుకు పోలీస్ యంత్రాంగం సరికొత్త అస్త్రాలను సిద్ధం చేసింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సూళ్లూరుపేట, తడ ప్రాంతాల్లో పోలీసులు అత్యాధునిక 'డ్రగ్ టెస్టింగ్ కిట్లతో' మెరుపు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులు పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు.

**అత్యాధునిక పరిజ్ఞానంతో చెక్**

నాయుడుపేట డీఎస్పీ సెంచు బాబు పర్యవేక్షణలో, సీఐ మురళీకృష్ణ నేతృత్వంలో పోలీసులు శుక్రవారం రాత్రి ముమ్మర తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన తొమ్మిది మందికి ఈ నూతన కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించగా, అందులో ముగ్గురికి పాజిటివ్ అని తేలింది. ఇంతకుముందు కేవలం పట్టుకుంటే తప్ప తెలిసేది కాదని, కానీ ఇప్పుడు ఈ కిట్ల ద్వారా సెకన్ల వ్యవధిలో గంజాయి సేవించినట్లు నిర్ధారణ అవుతుందని సీఐ తెలిపారు.



**మూలాలను వెతికి తీస్తాం:**

ఈ సందర్భంగా సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ.. గంజాయి అమ్మే వారి కంటే, కొనే వారి ద్వారా అసలు నెట్వర్క్ను ఛేదిస్తామని స్పష్టం చేశారు. పట్టుబడిన వ్యక్తుల ద్వారా వీరికి గంజాయి ఎక్కడి నుంచి వస్తుంది? ఎవరు సరఫరా చేస్తున్నారు? అనే కోణంలో లోతైన దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు. తిరుపతి జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసు శాఖ దృఢ సంకల్పంతో ఉందని, ఎవరైనా గంజాయి సరఫరా చేసినా లేదా సేవించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువతకు విజ్ఞప్తి:

క్షణికానందం కోసం మత్తుకు బానిసలై జీవితాలను పాడు చేసుకోవద్దని, తల్లిదండ్రుల ఆశలను అడియాశలు చేయవద్దని పోలీసులు హితవు పలికారు. గంజాయి సమాచారం తెలిసిన వారు భయం లేకుండా పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తడ, సూళ్లూరుపేట ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సోమిరెడ్డి తాత దిగి రావాలి

**నెల్లూరు జిల్లా- జన సంఘర్షణ :**
నెల్లూరు జిల్లా కోర్టుకు సాయంత్రం 4 గంటల సమయంలో హాజరైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి. సోమిరెడ్డి అక్రమాస్తులను కలిగి ఉన్నాడంటూ ఆరోపణలు చేసిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని 2017లో కాకాణి పై నమోదైన కేసు విషయంలో నాలుగవ అదనపు జ్యూడిషియల్ మ్యాజిస్ట్రేట్ కోర్టుకు హాజరైన కాకాణి. కేసును తదుపరి విచారణ నిమిత్తం ఎమ్మెల్యే, ఎంపీలకు, చెందిన ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన కోర్ట్. సోమిరెడ్డి కి ఇతర దేశాల్లో అక్రమ ఆస్తులు ఉన్నట్టు కాకాణి మీడియా సమావేశంలో వెల్లడించిన విషయం తెలిసిందే. సోమిరెడ్డి తనకు అక్రమ ఆస్తులు లేవని నిరూపించుకోలేక 2017 వ సంవత్సరంలో కాకాణి పై తప్పుడు కేసు బనాయించడం జరిగింది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన నాటి పబ్లిక్ ప్రాసిక్యూటర్ లు, కేసుకు విచారణ అర్హత లేదని ప్రభుత్వానికి నివేదించి, కేసును తీసివేయాలంటూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. కోర్టులో కేసు ఎత్తివేసే విషయంలో తర్జనభర్జనలు జరుగుతున్న



క్రమంలో కేసుకు సంబంధించిన ఫైళ్లు దొంగతనానికి గురికావడం జరిగింది. సోమిరెడ్డి పదే పదే కోర్టులో ఫైళ్లు గల్లంతు విషయమై కాకాణి పాత్ర ఉన్నట్లు రకరకాల కథనాలు వినిపించడం జరిగింది. కోర్టులో ఫైళ్ల మిస్సింగ్ కేసులో ఉన్నత న్యాయస్థానం సిబిఐ విచారణ జరిపి నిజానిజాలు నిగ్గు తేల్చాల్సిందిగా ఆదేశించడం జరిగింది. సుమారు సంవత్సరం కాలం పాటు సిబిఐ విచారణ చేపట్టి చివరకు కాకాణి కి కోర్టు లో ఫైళ్ళ మిస్సింగ్ కేసులో క్లీన్ చిట్ ఇవ్వడం జరిగింది. పచ్చ పత్రికలు ఈనాడు, ఆంధ్రజ్యోతి, పచ్చ చానళ్లు, ఏబీఎన్, టీవీ 5, ఈటీవీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున కాకాణి ముద్దాయిగా ఉన్న కోర్టు ఫైళ్ల మిస్సింగ్ కేసు వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు జరిపితే న్యాయం జరగదని, సిబిఐ చేత దర్యాప్తు చేయించాలని పుంఖాను, పుంఖాలు గా వార్తా కథనాలు రాయడం, ప్రసారం చేయడం జరిగింది. సుదీర్ఘ కాలం సీబీఐ విచారణ చేపట్టి చివరకు కాకాణి కి సంబంధం లేదంటూ క్లీన్ చిట్ ఇవ్వడంతో సిబిఐ విచారణ సరిగ్గా జరగలేదంటూ, పచ్చ మీడియా సాక్షాత్తు సిబిఐ దర్యాప్తు పైనే అనేక అనుమానాలు వ్యక్తం చేస్తూ, వార్తా కథనాలు వండి వార్చడం జరిగింది. పచ్చ మీడియా మొదట సిబిఐ చేత విచారణ జరిపించాలని పదే పదే పేర్కొని, సిబిఐ విచారణ జరిపి, క్లీన్ చిట్ ఇచ్చిన పిదప, సిబిఐ పైనే ఆరోపణలు చేయడం గమనర్హం. కాకాణి కోర్టుకు హాజరైన నేపథ్యంలో నెల్లూరు జిల్లా కోర్టులోని లాయర్లు విచ్చేసి, కాకాణి వెంట కోర్టు హాల్ లోకి ప్రవేశించడం జరిగింది. తప్పుడు కేసులకు భయపడే ప్రసక్తే లేదని, సోమిరెడ్డి గాని, సోమిరెడ్డి తాత దిగి వచ్చినా కాకాణి పై చేసిన తప్పుడు ఆరోపణలు రుజువు చేయడానికి సాధ్యం కాదని కాకాణి అనుచరులు ధీమా వ్యక్తం చేశారు. కాకాణి కోర్టుకు రానున్నారని తెలిసి పచ్చ మీడియా ఉదయం 10నుండి సాయంత్రం 5గంటల వరకు తిండి, తిప్పలు లేక, పడిగాపులు కాయడాన్ని చూసి ' ఇదేమి కర్మ రా బాబు' అంటూ హేళనగా నవ్వుకుంటూ మాట్లాడుకున్న న్యాయవాదులు, కోర్టుకు విచ్చేసిన కక్ష దారులు.

# నంద్యాల సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుల నియామకం



**నంద్యాల జన సంఘర్షణ : మే 8..**
నంద్యాల సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ప్రముఖ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిరివెళ్ల మండలం గంగవరం గ్రామంనకు చెందిన వై.నాగ శేషు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం 11:30 గంటల సమయం నందు నంద్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్.డి.ఓ), సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ సి. విశ్వనాథ్ సార్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వై.నాగశేషు మాట్లాడుతూ ..తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సబ్ డివిజన్ పరిధిలోని పౌర హక్కుల పరిరక్షణకు, ప్రభుత్వ నిబంధనల మేరకు ఉల్లంఘించకుండా క్రమశిక్షణతో అమలు చేయుటకై అధికారుల సూచనల మేరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సేవలందిస్తున్న వై నాగశేషు కమిటీ సభ్యునిగా ఎంపిక కావడం పట్ల పలు ప్రజాసంఘాలు బీసీ విద్యార్థి సంఘాలు, వివిధ దళిత సంఘాలు మిత్రులు, ఆత్మీయులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదంలో మృతుని కుటుంబానికి 5 లక్షల చెక్కును పంపిణీ చేసిన గంధమనేని

- **కార్యకర్త బీమాతో ఆ కుటుంబానికి భరోసా...**



**జన సంఘర్షణ :**
చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం మండలం ఆరిమాకుల పల్లె దళితవాడకు చెందిన బాలకృష్ణ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. అతనికి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సహకారంతో బాలకృష్ణన్కు ఐదు లక్షల బీమా చెక్కు వచ్చింది. దీనిని ఎస్ఆర్ పురం మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు బాలకృష్ణన్ భార్య కుతూహలమ్మకు అందించారు . ఈ సందర్భంగా కుతూహలమ్మ మాట్లాడుతూ.. నా భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు నా భర్త సభ్యత్వం బీమా ఐదు లక్షలు రావడానికి కృషిచేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, మంత్రి లోకేష్కి, ఎమ్మెల్యే డాక్టర్ థామస్కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కుతూహలమ్మ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని కుతూహలమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ చైర్మన్ నిరంజన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, సుబ్రహ్మణ్యం నాయుడు, రఘు నాయుడు, వేణు, బాలాజీ, రవి, శ్రీరాములు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో నేడు 5 గంటలపాటు విద్యుత్ అంతరాయం



**సూళ్లూరుపేట మే 8 2026 జన సంఘర్షణ :**
సూళ్లూరుపేట పట్టణంలోని మన్నేముతూరి సబ్ స్టేషన్ పరిధిలో నేడు శనివారం విద్యుత్ లైన్లు, ట్రాన్స్ఫార్మర్ల మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ కారణంగా ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇసకమెట్ట కోళ్ల మిట్ట బాపూజీ కాలనీ రాఘవైపేట సార్ బస్టాండ్ దేగల పాలెం కసారెడ్డిపాలెం వంటి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డి ఈ ఆర్ శేఖర్ తెలిపారు. వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు. చెంగాలమ్మ సబ్ స్టేషన్ పరిధిలోని పడమటి వైపు ప్రాంతంలోని ఎలాంటి అంతరాయం ఉండబోదని ఆయన స్పష్టం చేశారు.

# రాగిమానుపెంట విద్యార్థులకు కంప్యూటర్ స్పోకెన్ క్లాస్ ప్రారంభించిన టిడిపి యువ నాయకుడు ఎన్నారై ఎన్.పి.విక్రమ్

- **నేషనల్ హ్యూమన్ రైట్స్ సెక్రటరీ మదన్.బి ఆధ్వర్యంలో**



**బంగారుపాలెం మే 8 జన సంఘర్షణ :**
బంగారుపాళ్యం మండలంలోని రాగిమానుపెంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థుల నాలెడ్జ్ కోసం నలగాంపల్లి గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకులు ఎన్నారై ఎన్.పి. విక్రమ్ కంప్యూటర్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. చుట్టుపక్కల గ్రామస్తుల పిల్లలు కూడా వచ్చి కంప్యూటర్స్ నేర్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం నేషనల్ హ్యూమన్ రైట్స్ సెక్రటరీ మదన్.బి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామినేని బాలకృష్ణ నాయుడు, మాజీ సింగల్ విండో చైర్మన్ నాగరాజు నాయుడు, బెజవాడ నవీన్, దుర్గా చౌదరి,విక్రమ్, అభిరామ్, సాయి, రాగిమానుపెంట యూత్ అండ్ రాగిమానుపెంట గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కేరళంపై కాంగ్రెస్ మల్లగుల్లాలు

**సిఎం ఎవరనేదానిపై తేల్చుకోలేని పార్టీ**

**నేడు స్పష్టత వచ్చే అవకాశం ఉందన్న పార్టీ నేతలు**

**న్యూఢిల్లీ/ తిరువనంతపురం, మే9 :** తమిళనాట ముఖ్యమంత్రి పదవిపై ఏర్పడిన సందిగ్ధత వీడడంతో ఇప్పుడు అందరి దృష్టి పొరుగు రాష్ట్రం కేరళపై పడింది. ఫలితాలు వెలువడి ఐదు రోజులు గడుస్తున్నా.. సీఎం ఎవరనే దానిపై ఇంకా స్పష్టతరాలేదు. సీఎం ఎంపికపై దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం జరిగినప్పటికీ.. సీఎం పేరును మాత్రం వెల్లడించలేదు. దీంతో ఆదివారం దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయఢంకా మోగించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పర్యటించిన ఏఐసీసీ పరిశీలకులు ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు శుక్రవారం నివేదిక సమర్పించారు. ఈ క్రమంలోనే శనివారం సాయంత్రం 4 గంటలకు ఖర్గే నివాసంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి రాహుల్ గాంధీ, కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్, సీఎం పదవి రేసులో ఉన్న వీడీ సతీషన్, కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితల హాజరయ్యారు. కీలక సమావేశం ముగిసిన అనంతరం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీ మీడియాతో మాట్లాడారు. సీఎం అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు సంయమనం పాటించాలని కోరారు. నాయకత్వ ఎంపికపై అధిష్ఠానం సమష్టిగా నిర్ణయం తీసుకుంటుందన్నారు. మరోవైపు సీఎం ఎవరనేది ప్రకటించే ముందు మరోసారి చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## చంద్రబాబు, పవన్ నివాసాలకు మోడీ

**హైదరాబాద్, మే9 :** ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా నగరంలోని ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసాలకు ప్రధాని వెళ్లే అవకాశముంది. ఇప్పటికే చంద్రబాబు, పవన్ నివాస మార్గాల్లో భద్రతా సిబ్బంది ప్రధాని కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. పవన్ కళ్యాణం ముక్కు సర్జరీతో రెస్ట్ తీసుకుంటున్నారు. చంద్రబాబు శనివారం బెంగాల్ సిఎం సువేందు అధికారి ప్రమాణానికి కూడా హాజరయ్యారు.

## మణికంఠ నగర్ కాలనీలో సీనియర్ సిటిజన్ భవనం శంకుస్థాపన

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న సింగిరెడ్డి పద్మారెడ్డి**

**బోడుప్పల్ :**



మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మణికంఠ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 01 లో మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ సహకారంతో సుమారు 10లక్షల ఎంపీ నిధులతో సీనియర్ సిటిజన్స్ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి విశ్వం గుప్త, బిజెపి నాయకులు గోన శ్రీనివాస్ రెడ్డి, బోడుప్పల్ ఈస్ట్ బీజేపీ అధ్యక్షుడు ఏర్పుల మహేష్, సిలువేరు శంకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మణికంఠ నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ భవన నిర్మాణానికి సహకరిస్తున్న ఎంపీ ఈటెల రాజేందర్, బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మాజీ కార్పొరేటర్ పోగుల నరసింహారెడ్డి, ఇతర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ మాజీ అధ్యక్షుడు బ్రహ్మాచారి, కార్యదర్శి జివి రమణరెడ్డి, ఎన్ఐఎన్ కాలనీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ రెడ్డి, కాలనీ అసోసియేషన్ సభ్యులు కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతీ తల్లికి చిత్రకళా నివాసి

**వేలేరు :**





ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే మదర్స్ డే సందర్భంగా స్థానిక యువ కళాకారుడు రజినీకాంత్ తల్లి ప్రేమను ప్రతిబింబించే హృద్యమైన పెయింటింగ్ను రూపొందించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. తల్లి తన చిన్నారిని ప్రేమగా ముద్దాడుతున్న దృశ్యాన్ని ఆవిష్కరించిన ఈ కళాఖండం సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ పెయింటింగ్లో తల్లి ప్రేమ, ఆప్యాయత, అనురాగం మరియు మమకారం ఎంతో సహజంగా ప్రతిఫలించాయని కళాభిమానులు అభిప్రాయప డుతున్నారు. ప్రకాశవంతమైన రం గులు, భావోద్వేగాలను ప్రతిబిం బించే ముఖ కవళికలు చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భం గా కళాకారుడు రజినీకాంత్ మాట్లా డుతూ "అమ్మ ప్రేమను మాటల్లో పూర్తిగా చెప్పలేం. తల్లి ముద్దులో ఉన్న ప్రేమ, కళ్లలో కనిపించే కరుణను కళ ద్వారా చూపించాలని ప్రయత్నిం చాను. ఈ చిత్రాన్ని ప్రతి తల్లికి అంకితం చేస్తున్నాను" అని తెలిపారు.కళ అనేది భావాలను పలికించే భాష అని, అందులో "అమ్మ" అనే భావానికి ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# వైభవంగా విగ్రహ ప్రతిష్టాపన

**పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు**

**మాడ్గులపల్లి:**

మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో శ్రీ అభయ ప్రసన్నాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరై, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు,గ్రామాల్లోకి విచ్చేసిన ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు యువకులు ఘన స్వాగతం పలికారు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ప్రతిష్టాపన పూజల్లో పాల్గొన్న అనంతరం ఆయన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు,ఈ సందర్భంగా నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు నిర్వహించడం వల్ల ప్రజల మధ్య సోదరభావం, ఐక్యత పెంపొందుతాయని అన్నారు భక్తి మార్గం మనిషికి మానసిక ప్రశాంతతను ఇస్తుందని, శ్రీ అభయ ప్రసన్నాంజనేయ స్వామి వారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ పాడిపంటలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆయన కోరుకున్నారు,ఈ కార్యక్రమంలో నాయకులు పాలుట్ల బాబయ్య, సర్పంచ్ ఉర ప్రసన్న రాబర్ట్, అల్లుబెల్లి గోవింద్ రెడ్డి, గుదే శర్మ, సోములు, గోవిందు, కర్ర శ్రీనివాస్ రెడ్డి, మహేష్, శ్రీను, రామస్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు



## నిరుద్యోగ యువతకు ఉద్యోగాలే లక్ష్యం:సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**-తుక్కుగూడలో ప్రముఖ అంతర్జాతీయ సంస్థలో ఇంటర్వ్యూల పరిశీలన**

**కల్వకుర్తి :**



కల్వకుర్తి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్, టాస్క్ సీవోఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. తుక్కుగూడలోని ప్రముఖ అంతర్జాతీయ ఎలక్ట్రానిక్ సంస్థలో నిరుద్యోగ యువత కోసం నిర్వహించిన ఇంటర్వ్యూ కార్యక్రమంలో పాల్గొని ఆయన ఇంటర్వ్యూ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతి కుటుంబంలో కనీసం ఒకరు ప్రభుత్వ లేదా ప్రైవేటు రంగంలో ఉద్యోగం పొందాలన్నదే తన సంకల్పమని చెప్పారు. ఇందుకోసం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శిక్షణా కార్యక్రమాలు, ఉద్యోగ మేళాలు, నిరుద్యోగ యువతతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇంటర్వ్యూలకు కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి యువత హాజరయ్యారు. వెల్దండ మండలం నుంచి 6 మంది, ఆమనగల్ నుంచి 9 మంది, కడ్తాల్ నుంచి ఇద్దరు, కల్వకుర్తి నుంచి ఇద్దరు కలిపి మొత్తం 19 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధుల బృందం, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసిన కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్

**కూకట్ పల్లి**



హైదరాబాద్ సచివాలయంలో శనివారం తెలంగాణ పీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బండి రమేష్ ని కమ్మ కార్పొరేషన్ చైర్మన్గా నియమితులైనందుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ భేటీలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూల బొకే అందజేసి, శాలువాతో సన్మానించి బండి రమేష్ ను ఘనంగా అభినందించారు. అనంతరం మాట్లాడుతూ, కమ్మ కార్పొరేషన్ చైర్మన్గా సమాజానికి తగిన సేవలు అందించాలని, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కమ్మ వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సహకారంతో పేద కుటుంబాలను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే విధంగా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు.అదేవిధంగా, విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పనలో కార్పొరేషన్ కీలక పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. అవసరమైన ప్రతి సహకారాన్ని ప్రభుత్వం తరఫున అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలియజేస్తూ, కమ్మ సమాజ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశం ఆత్మీయ వాతావరణంలో కొనసాగగా, కాంగ్రెస్ నాయకులు మరియు అనుచరులు బండి రమేష్ కు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజా సమస్యలపై పోరాడే గొంతుకలను అణిచివేయడం ప్రజాస్వామ్య విరుద్ధం : ఏనుగు మనోహర్ రెడ్డి

**స్తంభంపల్లిలో అక్కనపల్లి కరుణాకర్ను పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు**

**వేములవాడ టౌన్ :**



ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసే ప్రశ్నించే గొంతుకలను అక్రమ అరెస్టులతో అణిచి వేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం బోయిన్పల్లి మండలం స్తంభంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అక్కనపల్లి కరుణాకర్ను పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఇటీవల జైలు నుంచి విడుదలై వచ్చిన కరుణాకర్ను కలిసి మనోధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఏనుగు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజా సమస్యలపై పోరాటం చేసే ఉద్యమకారులను గౌరవించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం నిలుస్తుందని పేర్కొన్నారు. అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేరని, ప్రజా సమస్యలపై పోరాడే నాయకులకు ఎల్లప్పుడూ ప్రజల మద్దతు ఉంటుందని అన్నారు. ప్రభుత్వం ఇలాంటి చర్యలను విరమించుకుని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ కోర్టు న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుడిసె సదానందం, బోయిన్పల్లి మాజీ మండల అధ్యక్షులు

